

# గణేశులు రెడీ

- రంగులద్దుకొని సిద్ధమైన ప్రతిమలు
- మండపాల ఏర్పాటులో నిమగ్నమైన యువకులు

వినాయక చవితికి గణేశ్ విగ్రహాలు రెడీ అయ్యాయి. రేపటి పండుగ కోసం తయారీ కేంద్రాల వద్ద రంగులద్దుకొన్న ప్రతిమలు ప్రతిష్ఠాపనకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే యువత మండపాల ఏర్పాటులో నిమగ్నమవగా.. మరికొందరు విగ్రహాలను తరలించే పనిలో బిజీబిజీగా ఉన్నారు. అయితే మట్టి ప్రతిమలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు.

# రైతన్నలు రోడ్డు'పాలు'



మార్చాల వద్ద జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై పాలు ఒలకబోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

- పెండింగ్‌లో ఉన్న రెండు నెలల పాలబిల్లులు చెల్లించాలని
- పాడి రైతుల డిమాండ్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా హోరెత్తిన నినాదాలు

కల్వకుర్తి, సెప్టెంబర్ 5 : రెండు నెలలుగా బకాయిలో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కల్వకుర్తి మండలం మార్చాల గేట్ వద్ద పాడి రైతులు ధర్నా చేపట్టారు. కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై పాలు ఒలకబోసి నిరసన వ్యక్తం చేశారు. పాడి రైతులపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులపై వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలు పోస్తున్నామని, బిల్లులు చెల్లించకుండా అరిగోస పెడుతున్నదన్నారు. 15 రోజులకోసారి ఇచ్చే బిల్లులను చెల్లించకపోగా.. రెండు నెలలకు సంబంధించిన నాలుగు బిల్లులను తమ వద్దే ఉంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాల బిల్లులతోనే చాలా కుటుంబాలు కాలం వెల్లదీస్తున్నాయని.. పిల్లలు ఫీజులు, వ్యవసాయ పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతుబంధుతోపాటు పాలబిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వడ్డీ వ్యాపారులతో మిత్తికి తెచ్చుకుంటున్నామన్నారు. బంగారాన్ని బ్యాంకులో కుదువ పెట్టుకుంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. రుణమాఫీ అరకొరగా చేసి కాంగ్రెస్ సర్కారు నిలువునా మోసం చేసిందన్నారు. ఒక్కో రైతుకు రెండు నెలలకు కలిసి సరాసరిన రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాయితీపై పశువుల దాణాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలయ్య, మాజీ సర్పంచ్ సునీత, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పాలబూత్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు మోహన్‌రావు, మల్లేశ్, లింగం, నిజాం సర్కార్, తిరుపతయ్య, కిశోర్, మల్లేశ్, బాలరాజు, రమేశ్, కృష్ణ, పాడి రైతులు శేషిరెడ్డి, జంగారెడ్డి, కిశోర్, వెంకట్‌రెడ్డి, కాశిరెడ్డి, లింగమయ్య, మల్లయ్య, శ్రీను, రాము, రాజు, తాజుద్దీన్, బుచ్చయ్య, శ్రీశైలం, రాముడు ఉన్నారు.

# భారీగా నల్లబెల్లం పట్టివేత

- 21.3 టన్నులు స్వాధీనం
- ఇద్దరి అరెస్టు, వాహనాలు సీజ్



పట్టుకున్న బెల్లం, వాహనాలతో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

జడ్చర్ల, సెప్టెంబర్ 5 : హైదరాబాద్ నుంచి చాలా కాలంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లికి నాటుసారాకు వినియోగించే బెల్లం, పటికను పోలీసుల కళ్లుగప్పి సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. మహబూబ్‌నగర్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పక్కా సమాచారం మేరకు గురువారం జడ్చర్ల బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో రాష్ట్ర రాజధాని నుంచి వచ్చిన ట్రాలీ ఆటో (టీఎస్ 06 యూడీ 8908)ని నిలిపి తనిఖీలు చేశారు. అందులో 60 బ్యాగుల (ఒక్కో బ్యాగులో 30 కేజీలు) బెల్లం.. మొత్తం 1800 కిలోలు, 10 లీటర్ల నాటుసారాను, 20 కేజీల పటికను పట్టుకున్నారు. సింగరేణి కాలనీకి చెందిన కాట్రావత్ శ్రీనును అరెస్ట్ చేశారు. తెలకపల్లి మండలం దేవదారుకుంటకు తీసుకెళ్తున్నట్లు వివరించాడు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్‌లోని శివరాంపల్లి ఎక్స్‌రోడ్‌లోనూ తనిఖీలు చేపట్టారు. అక్కడే ఆగి ఉన్న లారీ (కేఏ 28 బీ 6609) తనిఖీ చేయగా.. అందులో 650 (ఒక్కో సంచి 30 కేజీలు) సంచుల నల్ల బెల్లం.. మొత్తం 19,500 కేజీలు, 40 కేజీల పటిక, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కర్ణాటకలోని బీదర్‌కు చెందిన రఫీని అరెస్టు చేశారు. నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ జిల్లాలకు తరలించి విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. రెండు వాహనాల్లో కలిపి మొత్తం 21.3 టన్నుల బెల్లం (విలువ రూ.68.5 లక్షలు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పట్టుకున్న అధికారులు, సిబ్బందిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి అభినందించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాస్, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, విప్లవరెడ్డి, ఎస్సై సృజన్‌రావు, నాగరాజుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నబోతున్న 'చిన్నోనిపల్లి'



గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామం మధ్యలోకి చేరిన రిజర్వాయర్ తిరుగుజలాలు

- రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో మునిగిన కిందిగేరి
- సమాంతరకాల్వ ఉన్నా.. ఫలితం శూన్యం
- ఇప్పటికే గ్రామాన్ని వీడిన దాదాపు 50 కుటుంబాలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- 'మాకంటూ ఒక రోజు వస్తుంది' అంటూ సోషల్‌మీడియాలో గ్రామస్తుల ఆవేదన

గట్టు, సెప్టెంబర్ 5 : నెట్టెంపాడు ఎత్తిపోతల పరిధిలో నిర్మించిన రిజర్వాయర్ (చిన్నోనిపల్లి) బ్యాక్‌వాటర్ భారీగా వస్తుండడంతో మండలంలోని చిన్నోనిపల్లి గ్రామం చిన్నబోతున్నది. నీళ్లు వస్తుండడంతో కుటుంబాలు ఒక్కొక్కటిగా గ్రామాన్ని వీడుతున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన సమాంతర కాల్వ ద్వారా రిజర్వాయర్ నీటిని బయటకు తోడి గ్రామాన్ని ముంపు నుంచి కాపాడతామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా.. వారి మాటలకు ఇక్కడ జరుగుతున్న తంతుకు ఏ మాత్రం సరిపోలడంలేదు. కాల్వ ద్వారా బయటకు వెళ్తున్న నీరు కొద్దిగా ఉండగా.. వాగులు, వంకల ద్వారా రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు అధికంగా ఉంటున్నది. దీంతో చిన్నోనిపల్లి గ్రామంలోని కిందిగేరిలో ఉన్న ఇండ్లల్లోకి నీరు చేరింది. ఏ రోజుకారోజు నీటి ప్రవాహం పెరుగుతుండడంతో చిన్నోనిపల్లి దాదాపుగా ఖాళీ అవుతున్నది. గ్రామంలో 261 ఇండ్లు ఉండగా.. ఇప్పటికే దాదాపుగా 50 కుటుంబాలు మూటాముల్లె సర్దుకొని గ్రామం వీడారు. తాము గ్రామాన్ని ఖాళీ చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తున్నదని, గుండె బరువు చేసుకొని కన్నీళ్లు పెట్టుకుంటూ ఊరును ఖాళీ చేస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మీడియా ప్రతినిధులు తప్పా గ్రామంలోకి ఏ అధికారిగానీ, ప్రజాప్రతినిధులుగానీ రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. కాగా, 'పుట్టిపెరిగి, ప్రయోజకులను చేసిన ఊరును వదిలివెళ్లాలంటే బాధగా ఉన్నది. గ్రామ బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. తమకంటూ ఓ రోజు వస్తుంది. ఇబ్బందులు పెట్టిన అందరినీ దేవుడు చూసుకుంటాడు' అంటూ గ్రామస్తులు, నిర్వాసితులు సోషల్‌మీడియాలో చేస్తున్న కామెంట్లు ఆలోచింపజేస్తున్నాయి. ఇదిలాఉండగా, తమకు వచ్చే ఆర్థిక ప్రయోజనాలు, ముంపు గ్రామాలతోపాటు పునరావాసాలకు ఇస్తున్న లబ్ధిని కల్పిస్తే న్యాయం జరుగుతుందనే చిన్నఆశతో ఉన్నారు.

# అంచనాలకు అందని నష్టం!

తెగిపోయిన కట్టకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



- వట్టెం పంప్‌హౌస్‌ను ముంచిన నిర్లక్ష్యం!
- పరిస్థితిని అంచనా వేయడంలో విఫలం
- టన్నెల్‌లో 20 కిలోమీటర్ల మేర నిండిన జలాలు
- పునరుద్ధరణ పనులు చేపట్టిన అధికారులు
- సొరంగంలోకి వరద రాకుండా అడ్డుకట్ట
- ఆరు చోట్ల నుంచి డీవాటరింగ్‌కు చర్యలు
- భారీ మోటర్ల ఏర్పాటు రంగం సిద్ధం
- నెలరోజుల సమయం పట్టే అవకాశం?

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల(పీఆర్‌ఎల్‌ఐ)లో భాగంగా నిర్మిస్తున్న వట్టెం పంప్‌హౌస్ నీట మునిగింది. కాగా, ఈ మునకకు సంబంధించి షాకింగ్ విషయాలు బయటకొస్తున్నాయి. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యమే పంప్‌హౌస్ మునకకు కారణంగా తెలుస్తున్నది. సుమారు 20 కిలోమీటర్ల మేర నిర్మించిన సొరంగాల్లో 35 లక్షల క్యూసెక్కుల నీరు చేరిందని అంచనా. ఇంత పెద్ద ఎత్తున నీరు చేరుతున్నా.. ఇటు కాంట్రాక్టర్లు, అటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. నిండా మునిగాక అధికారులు చర్యలు చేపట్టడం వెనుక ఉన్న మతలబేమిటో అర్థం కావడం లేదు. పీఆర్‌ఎల్‌ఐని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



వట్టెం పంప్‌హౌస్‌లోకి చేరిన వరద జలాలు

**ఇదీ జరిగింది..**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలు, కుమ్మెర చెరువులు ఉప్పొంగాయి. దీంతో వట్టెం రిజర్వాయర్‌కు రెండు వైపుల నుంచి సొరంగాల్లోకి వరద చేరింది. ఈ నీరంతా టన్నెళ్ల నుంచి సర్జిపూల్‌లోకి రావడంతో వేగంగా నిండింది. అయితే, ఈ నీటిని అడ్డుకునేందుకు గేట్లు లేకపోవడంతో నీటిమట్టం పెరిగి పంప్‌హౌస్‌లోకి మళ్లింది. పంప్‌హౌస్‌లో రెండు అంతస్తులు నీట మునిగి మోటర్లలో చేరి నీళ్లు ఊబికి వచ్చాయి. పెద్ద ఎత్తున నీరు రావడంతో సోమ, మంగళవారాల్లో మోటర్లు బిగిస్తున్న బీహెచ్‌ఈఎల్ కంపెనీ టెక్నికల్ సిబ్బంది గమనించి అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలుస్తున్నది. దీంతో అధికారులు ఉన్న కొద్దిమంది సిబ్బందిని బయటికి పంపించేశారు. అయితే, అప్పటికే నష్టం జరిగిపోయింది.

**భారీ ఎత్తున నష్టం..**

నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం పంప్‌హౌస్ నీట మునగడంతో భారీ ఎత్తున నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై ఇటు అధికార యంత్రాంగం కానీ అటు కాంగ్రెస్ సర్కార్ కానీ స్పందించడం లేదు. సొరంగాల్లో ఉన్న మిషనరీతోపాటు సర్జిపూల్, పంప్‌హౌస్‌లలో ఉన్న సామగ్రి కూడా నీట మునిగింది. కేసీఆర్ సర్కార్ మారాక.. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు అనుగుణంగా పనులు చేపడుతున్నారు. దీంతో పర్యవేక్షణ లేక అంచనాలకు అందని నష్టం వాటిల్లింది.

**ముందే పసిగట్టిన కాంట్రాక్టర్..**

పీఆర్‌ఎల్‌ఐలో భాగంగా పనులు చేపడుతున్న మెగా కంపెనీ.. వట్టెం పంప్‌హౌస్, రిజర్వాయర్ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఏదుల నుంచి వట్టెం వరకు సుమారు 25 కిలోమీటర్ల సొరంగ మార్గం ఉన్నది. వట్టెం పంప్‌హౌస్‌కు వచ్చే సొరంగమార్గాల సమీపంలో అనేక చెరువులు, కుంటలు ఉన్నాయి. సొరంగాల్లోని రాళ్లను బయటకు తీసేందుకు.., లోపలికి వెళ్లేందుకు అనేకచోట్ల మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగానే నాగర్‌కర్నూల్ సమీపంలోని నాగనూలు, శ్రీపురం గ్రామాల మధ్యలో కూడా సొరంగమార్గం ఉన్నది. అయితే, ఇటీవల కురిసిన వర్షాలకు నాగనూల్ పెద్ద చెరువు ఉప్పొంగింది. చెరువు వెనుక భాగంలోనే సొరంగ మార్గం ఉన్నది. చెరువుకు అడ్డంగా ఉన్న కట్ట తెగిపోవడంతో నీళ్లన్నీ సొరంగంలోకి వెళ్లాయి. ఈ విషయాన్ని అక్కడ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు గుర్తించారు. కానీ, సమాచారం ఇవ్వకపోవడంతో భారీ నష్టానికి దారితీసింది. వర్షం అంతకంతకూ పెరిగి భారీగా వరద రావడంతో.. సొరంగమార్గాల్లోకి ఒక్కసారిగా నీరు వచ్చిచేరింది. వట్టెం సర్జిపూల్‌లోకి వచ్చిన నీరంతా కుమ్మెర చెరువుకు చెందినవని అధికారులు భావించారు. హుటాహుటిన అక్కడికి వెళ్లి నీటికి అడ్డుకట్ట వేశారు. అయినా ఇంకా నీళ్లు వస్తుండడంతో ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆరా తీసేలోగా నష్టం జరిగిపోయింది. నాగనూల్ చెరువు నుంచి భారీగా వరద వస్తున్న విషయాన్ని అధికారులకు కాంట్రాక్టర్ సమాచారం ఇవ్వకపోవడంతో భారీ ఆస్తి నష్టానికి దారి తీసింది. ఇదిలా ఉండగా, నీటిని బయటకు తీసేందుకు భారీ మోటర్లను సిద్ధం చేస్తున్నారు. నీళ్లను తీడేందుకు కనీసం నెల పట్టే అవకాశం ఉందని ఓ అధికారి వివరించారు. ఆరు చోట్ల డీవాటరింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

**పట్టించుకోని మంత్రి, ఎమ్మెల్యేలు..**

పంప్‌హౌస్ మునిగిపోవడంలో అధికారుల నిర్లక్ష్యం ఉన్నా.. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగినా కాంగ్రెస్ సర్కార్ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. కనీసం వట్టెం పంప్‌హౌస్‌ను పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులెవరూ రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా.. వట్టెంపై రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్, పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**నీటి ప్రవాహానికి అడ్డుకట్ట..**

పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్‌ను వరద ముంచెత్తడానికి కారణం అధికారుల స్వయంకృతాపరాదమే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరద నీరు టన్నెల్లోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం విషయం తెలుసుకొన్న ఇంజినీరింగ్ అధికారులు చెరువు నుంచి వచ్చే వరదకు అడ్డుకట్ట వేసే పనిలో నిమగ్నమయ్యారు. శ్రీపురం శివారులో ఉన్న సొరంగం వద్ద పెద్దపెద్ద రాళ్లు అడ్డం వేసి రక్షణ గోడను ఏర్పాటు చేసి ప్రవాహాన్ని అడ్డుకొనే పనులు ముమ్మరం చేశారు. పూర్తిస్థాయిలో నీటి రాకను నిలిపివేస్తేనే డీవాటరింగ్‌కు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# నిబద్ధతతో పనిచేయాలి

- ఉపాధ్యాయులతోనే సమాజ సంస్కరణ : మంత్రి జూపల్లి
- సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి : చిన్నారెడ్డి
- వనపర్తిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం




ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : సమాజ పరివర్తనలో విద్య అగ్రభాగాన ఉంటుందని, ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులుంటే.. వీరిలో కేవలం 22 లక్షల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. రూ.లక్షల ఫీజులు, అరకొర చదువులున్న ప్రైవేట్ కంటే.. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందన్నారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశమై వారిని చైతన్యం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. ఆయనను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని, విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ జిల్లాలో 500 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ.13.50 కోట్లతో మౌలిక వసతులు కల్పించామన్నారు. అనంతరం జిల్లాలోని 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి అవార్డులను అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఈవో గోవిందరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు వరప్రసాద్‌రావు, రవిప్రసాద్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసరావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోటర్ కాలిపోయినందునే తాగునీటి సమస్య



పెద్దతండాలో పర్యటించిన ఎంపీడీవో ఆంజనేయరెడ్డి

నమస్తే ఎఫెక్ట్

- పెద్దతండాలో పర్యటించిన ఎంపీడీవో
- 'నమస్తే' కథనానికి స్పందన


మల్దకల్, సెప్టెంబర్ 5 : మండలంలోని పెద్దతండా గ్రామ పంచాయతీలో బోరుకు అమర్చిన సింగిల్‌ఫేస్ మోటర్ కాలిపోయినందునే నీటి సమస్య తలెత్తిందని ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'బిందెలతో యుద్ధం' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పెద్దతండా వాసులతో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఏఆర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడారు. చేతిపంపుల్లో నీరు మురికిగా వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. ఏప్రిల్‌లో కొత్తగా బోరు వేశామని, దానిలో నీరు పుష్కలంగా వచ్చాయని ఎంపీడీవో చెప్పారు. సింగిల్‌ఫేస్ మోటర్ విద్యుత్ సమస్యతో కాలిపోవడంవల్లే తాగునీటి సమస్య వచ్చిందన్నారు. త్వరలోనే మోటర్ బిగించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి నర్సింహులును ఆదేశించారు.

# తండ్రి మందలించాడని..

- ఉరేసుకొని కుమారుడి ఆత్మహత్య

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 5 : తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కల్వకుర్తి పట్టణంలోని కల్యాణ్‌నగర్ కాలనీలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై మాధవరెడ్డి, ఏఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్.. కల్వకుర్తి పట్టణంలోని కల్యాణ్‌నగర్‌లో ఉంటున్నారు. ఇంటి ఆవరణలో ఉన్న సంపును కడిగేందుకు శ్రీనివాస్‌గౌడ్, అతడి పెద్ద కుమారుడు వెళ్తుండగా.. తానూ కడిగేందుకు వస్తానన డంతో చిన్నకుమారుడు యశ్వంత్(12)ను తండ్రి మందలించాడు. దీంతో ఇంట్లోకి వెళ్లి కిచెన్‌లో చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# రుసూల్ చెరువు వద్ద పులి అడుగులు



రుసూల్ చెరువు వద్ద పులి పాదముద్రలు

అచ్చంపేట, సెప్టెంబర్ 5 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని రుసూల్ చెరు వు వద్ద ఇరిగేషన్ అధికారులకు పెద్దపులి అడుగులు కనిపించాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు అలుగు వద్ద చెత్తతోపాటు భారీ చెట్లు అడ్డుగా పడ్డాయి. వీటిని తొలగించి అలుగులో నీళ్లు సులువుగా పారే పనులు చేయించేందుకు ఇరిగేషన్ ఏఈ రమేశ్, సిబ్బంది వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వారు అక్కడకు వెళ్లగా.. అంతకు ముందే అక్కడి నుంచి పులి వెళ్లినట్లు పాదముద్రలు కనిపించాయి. రుసూల్ చెరువు ప్రాంతంలో పులి సంచరిస్తున్నదని ఏఈ రమేశ్ తెలిపారు.

# సమయానికి బస్సులు నడిపించాలి



బస్టాండ్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 5 : సమయానికనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గురువారం సాయంత్రం విద్యార్థులు ధర్నా చేపట్టారు. పాఠశాల ముగిసే సమయానికి కొరటికల్ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట సీఐ రవీందర్ అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పారు. బస్సు ఏర్పాటు చేసి విద్యార్థులను గ్రామాలకు పంపించారు. ఈ విషయంపై అచ్చంపేట డీఎం మురళీధర్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. విద్యార్థులను ఉదయం అచ్చంపేటకు చేరవేసిన అనంతరం బస్సు హైదరాబాద్‌కు వెళ్తుందన్నారు. మళ్లీ అదే బస్సు సాయంత్రం వచ్చి కొరటికల్ వెళ్తుందని.. కానీ గురువారం బస్సు రావడం ఆలస్యమైందన్నారు. ధర్నా విషయం తెలిసిన వెంటనే నాగర్‌కర్నూల్ వెళ్లాల్సిన బస్సును రద్దుచేసి.. బస్సును కేటాయించామన్నారు.